—యం. జయశ్రీ

# లవ్ ట్రా(ప్)క్

## బాడీగార్డ్

రాజి చాలా ట్రిమ్‌గా తయారై శ్రీపతికోసం చూస్తోంది.

విసుగ్గా వరండాలో పచార్లు చేస్తోంది.

మధ్య మధ్య వాచీ చూస్తోంది.

ష్ప్ టైం అవస్తోంది.

అబ్బా... ఇంకా రారేమిటి ఈరోజు?

మరొకసారి అద్దంలో ముఖం చూసుకొంది.

ఫైనల్ టచప్ ఇచ్చింది.

చివరికి 5–30 గం. కొచ్చాడు శ్రీపతి.

"హమ్మయ్యా! వచ్చారా... త్వరగా ముఖం కడుక్కొని రడీ అవండి"

"ఎక్కడికి రాజీ?"

"ఈ రోజు నా అభిమాన నటుడి సినిమా రిలీజ్! సినిమా కెళదామండీ!"

"ఇప్పుడు — టికెట్స్ అందుతాయా?

"మీకాశ్రమ లేకుండా ప్రొద్దున మార్కెట్ కెళ్లినప్పుడు అడ్వాన్స్ బుకింగ్ తెచ్చాను —

"టైమ్ అవుతోందండి". తొందర పెట్టింది.

"అబ్బా ఈ రోజు చాలా అలిసిపోయానోయ్ . నేను రాలేను"

"అలా అంటే ఎలాగండీ మీతో కలిసి ముచ్చటగా సినిమా చూద్దామని టికెట్స్ తెస్తే...

"అదికాదు..."

ఇంకేం చెప్పొద్దు! మనం ఇద్దరం కల్సి వెళ్లి చాలా రోజులైంది, కష్టపడి టికెట్స్ తెస్తే... మొగుడితో కల్సి సినిమాలు షికార్లు సినిమాలకు తిరగాలని నాకుంటుంది కానీ మీకు భార్యతో సరదాగా గడపాలని ఉండదండీ" అలకగా మూతి తిప్పింది.

"రేపు మార్నింగ్ నేను ఫస్ట్ షిఫ్ట్ కెళ్ళాలి...

"అవునులే మీకు నా కోర్కెకంటే ఆ ఆఫీసు ఆ కొలీగ్సే ఎక్కువ"

"వెళ్ళాల్సిందేనా...?"

"..." ఏం మాట్లాడలేదు రాజి.

"సరే పద..."

పెళ్ళాం ముద్దుగా... మురిపెంగా ఏ కోసమే నేనున్నా, నీతోనే నాలోకం అన్నట్లుగా ఉంటే ఏ మొగుడు ఎగిరి గంతేయడూ...?

* * *

"ఏమిటి అన్నయ్యగార్ని చాలా బలవంతంగా సినిమాకి తీసుకెళ్లినట్లున్నారే నిన్న..."

ప్రక్క పోర్షన్ వదినగారు అడుగుతోంది మర్నాడు. ఆమె ఒక వెర్రి. ఎప్పుడూ ప్రక్క పోర్షన్ గోడకే అతుక్కొని ఉంటుంది.

"అవును వదినగారూ... ఒంటరిగా వెళితేనే హాయిగా ఎంజాయ్ చేయవచ్చు కానీ జులాయి వెధవలు ప్రక్కన చేరి వెకిలిచేష్టలు చేస్తున్నారు. అందుకే మొగుడంటూ ప్రక్కనే ఉంటే ఏ వెధవా కన్నెత్తి చూడడు. మన బాడీగార్డు మొగుడే కదా!" అంటోంది రాజి.

ప్రక్కింటామె నోరు తెరుచుకొని వింటోంది.

